

ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి

విద్యార్థులు గణితంపై శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్సీ

హయత్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గణితం పట్ల శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం, తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షలు జరిగాయి. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డు, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ గణితం పట్ల శ్రద్ధ చూపే విద్యార్థులు మిగతా సబ్జెక్టుల్లో కూడా రాణించగలరని అన్నారు. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ జి. రమేష్ మాట్లాడుతూ గణితం మాదిరిగానే మిగతా సబ్జెక్టులకు టాలెంట్ పరీక్షలు నిర్వహించాలని కోరారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ సమాజంలో గణిత ప్రాముఖ్యతను ప్రచారం చేయడానికి ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డులను బహూకరించారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్, కార్యదర్శి రామకృష్ణ, సతీష్‌కుమార్, కన్వీనర్ జి. శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, కె. యాదగిరిరెడ్డి, నక్క శ్రీనివాస్‌యాదవ్, శివకుమార్, జైపాల్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మధుయాష్కీగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూలక్ష్మీనగర్ కమిటీ సభ్యులు

కాలనీల అభివృద్ధికి కృషి : మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఇటీవల ఎన్నికైన సందర్భంగా కాలనీ ప్రధాన కార్యదర్శి రవికిరణ్ పొనుగుపాటి ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా మధుయాష్కీగౌడ్‌ను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రధానకార్యదర్శి రవికిరణ్ పొనుగుపాటి, ఉపాధ్యక్షుడు శ్రీధర్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు విజయ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

డివిజన్ అభివృద్ధికి కృషి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం ఎన్జీవోస్ కాలనీలో రూ.78లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తూ డివిజన్ అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పంపన వెంకటేశ్వరరావు, పీవీకే సోమయాజులు, రవిశంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

పద్మశాలీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మన్సూరాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించేందుకు పద్మశాలీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నాగోల్ డివిజన్ అల్కాపురిలోని రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పద్మశాలీలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పద్మశాలీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పద్మశాలీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశాలు, ప్రతిభా పురస్కార కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను కార్యవర్గ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు తిరందాసు యాదగిరి, యాదగిరేందర్, గంజి రామ్మోహన్, లక్ష్మీపతి, సుజాత, వెంకట్‌రావు, చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొమర్రాజు ఫౌండేషన్ సేవలు అభినందనీయం

కొత్తపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొమర్రాజు ఫౌండేషన్ సాహితీ, సంగీత సాంస్కృతిక సేవలు అభినందనీయమని సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు డాక్టర్. వంశీ రామరాజు కొనియాడారు. ఆదివారం న్యూనాగోల్‌లో ఫౌండేషన్ దశమ వార్షికోత్సవం, స్వరఝరి కల్చరల్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్.వంశీ రామరాజు మాట్లాడుతూ తెలుగు భాషకు ఘంటసాల, ఎస్పీ బాలు పాటలే అతిపెద్ద భాషా ప్రచారమన్నారు. పాట వినడమే ప్రాణవాయువని జస్టిస్ రాధారాణి వ్యాఖ్యానించడాన్ని గుర్తు చేశారు. ఘంటసాల పాటే పలువురికి ఉపాధి కల్పిస్తోందని పేర్కొన్నారు. ఫౌండేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు డా.కేఏవీ జ్ఞానకుమార్, డా.కేవీ శ్యామల మరిన్ని సాహితీ కార్యక్రమాలు నిర్వహించాలని అతిథులు కోరారు. కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు డా.కేవీ.రావు, ఎస్వీ రామారావు, శ్రీరామ్మూర్తి, పెన్నా శివరామకృష్ణ, గాయని అఖిల, బాలకేశ్వర్‌రావు, సుబ్బాజ్యోత్స్న, రఘువీర్‌ప్రతాప్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

హయత్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వాష్ రూమ్‌కని వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాంబకళానగర్‌లో నివాసం ఉండే కడమనేని యాదమ్మ, ఆమె కూతురు మమత(21) కలిసి. శనివారం హయత్‌నగర్ బస్ డిపోలో పని కోసం వచ్చారు. మధ్యాహ్నం 2.30గంటలకు మమత వాష్ రూమ్‌కు వెళ్లొస్తానని తల్లికి చెప్పి వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో యాదమ్మ చుట్టుపక్కల గాలించినా మమత ఆచూకీ లభించలేదు. దీంతో బంధువులను వాకబు చేసింది. అయినా ఫలితం లేకపోవడంతో ఆదివారం సాయంత్రం తన కూతురు కన్పించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుంట్లూరు హనుమాన్‌నగర్‌లో..

ఇంట్లో వారికి చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుంట్లూరు హనుమాన్‌నగర్‌లో పందిరి లక్ష్మి, భర్త గణేశ్ దంపతులు నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం 10.30గంటలకు గణేశ్ ఇంట్లో వారికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. సాయంత్రం అయినా భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మి బంధు,మిత్రులను వాకబు చేసింది. ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం రాత్రి 9గంటలకు తన భర్త కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడంగ్‌పేట్ భద్రతకు మరో పోలీస్‌స్టేషన్!

- తెరపైకి కొత్త డిమాండ్
- విస్తరిస్తున్న కాలనీలు.. సరిపోని పోలీసుల రక్షణ
- రాచకొండ సీపీకి వినతిపత్రం అందజేసిన మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో రోజురోజుకూ కాలనీలు విస్తరిస్తుండడంతో అందుకనుగుణంగా మరో కొత్త పోలీస్‌స్టేషన్ డిమాండ్ తెరపైకి వస్తోంది. ఈ కార్పొరేషన్‌లో మొత్తం ఎనిమిది గ్రామాలు ఉండగా వాటిలో నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, రాగన్నగూడ గ్రామాలు ఎక్కడో దూరంగా ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల పీఎస్ పరిధిలో కొనసాగుతున్నాయి. దాంతో ఆయా గ్రామాల ప్రజలు ఏమైనా అవసరాల నిమిత్తం అక్కడకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. ఇక బాలాపూర్, వెంకటాపూర్, మల్లాపూర్ తదితర గ్రామాలు పక్కనే ఉన్న బాలాపూర్ పీఎస్ పరిధిలో కొనసాగుతున్నాయి.



రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి (ఫైల్)

అవన్నీ పీఎస్‌కు సమీపంలోనే ఉండడంతో పెద్దగా సమస్య లేదు. ఇక మిగిలిన గ్రామాలైన బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, మీర్‌పేట్ పీఎస్ పరిధిలో కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలు మీర్‌పేట్‌కు పెద్దగా దూరంలో లేనప్పటికీ.. మీర్‌పేట్ పీఎస్ పరిధి విశాలంగా ఉండడంతో అక్కడి అధికారులు, సిబ్బందిపై అధిక భారం పడుతోంది. పైగా మీర్‌పేట్ పరిధిలో జనాభా అధికంగా గల నందనవనం, భూపేశ్‌గుప్తా నగర్, ఇంద్రసేనారెడ్డినగర్, జనార్దన్‌రెడ్డినగర్, లెనిన్‌నగర్ వంటి బస్తీలు అనేకం ఉన్నాయి. ఆయా బస్తీలు నేర సంఘటనలకు కేంద్ర బిందువుగా ఉంటున్నాయి. దాంతో అక్కడి పోలీసులకు విధి నిర్వహణ తలకు మించిన భారంగా మారుతోంది.



మీర్‌పేట్ పీఎస్

బడంగ్‌పేట్ కేంద్రంగా ఏర్పాటు చేస్తే..

బడంగ్‌పేట్ కేంద్రంగా ఒకవేళ కొత్త పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాల్సి వస్తే.. నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, రాగన్నగూడ, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్, కమ్మగూడ తదితర గ్రామాలను అందులో విలీనం చేసే అవకాశముంది. ఆయా గ్రామాలు వేగంగా విస్తరిస్తూ జనాభా సైతం అదే స్థాయిలో పెరుగుతుండడంతో ఇక్కడ ప్రత్యేక పోలీసుస్టేషన్ ఆవశ్యకత ఎంతో ఉన్నదని స్థానిక ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకుగాను బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలోని సర్వే నంబర్2లో పీఎస్ భవనం కోసం స్థలం కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ మునిసిపల్ భవనం, జిల్లా గ్రంథాలయ భవనం, ప్రజాభవన్, నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మోడల్ స్కూల్ భవనం, మునిసిపల్ ప్లే గ్రౌండ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ తదితర సంస్థలు పక్కపక్కనే ఉన్నాయి. ఈ దృష్ట్యా అదే ప్రాంతంలో పీఎస్ కూడా ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాల వారికి అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన బడంగ్‌పేట్ కౌన్సిల్ సమావేశంలో స్థానికంగా పీఎస్ ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం సైతం చేశారు. ఇదే విషయాన్ని వివరిస్తూ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి గురువారం రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక పీఎస్ ఏర్పాటు చేస్తే భవనం కోసం అనువైన స్థలం కేటాయిస్తామని ఆమె సీపీతో పేర్కొన్నారు. ఆమె వినతిపై సీపీ సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. పోలీసు డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతి మంజూరైతే వెంటనే స్థలం కేటాయిస్తామని, అక్కడ పోలీసు విభాగం ఆధ్వర్యంలో భవనం నిర్మించుకోవచ్చునని మేయర్ పారిజాతారెడ్డి పేర్కొన్నారు. పాలకవర్గం కృషి ఫలించి బడంగ్‌పేట్‌లో ప్రత్యేక పోలీసుస్టేషన్ ఏర్పాటైతే ఇక్కడి ఏడెనిమిది గ్రామాలకు పోలీసు సేవలు మరింత చేరువ కానున్నాయి.

రైతాంగ సమస్యలపై ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతి

సరూర్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని భారతీయ కిసాన్ సంఘ్ మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కోరింది. ఈ మేరకు సంఘ్ ప్రతినిధులు ఆదివారం ఆమెను జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ్ అధ్యక్షుడు సామ మాధవరెడ్డి, కార్యదర్శి నేముల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నిలకు ముం దు ప్రకటించినట్టుగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై దృష్టి సారించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వా రు ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా రైతులు వ్యవసాయంలో ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రెయిలర్ల రిజిస్ట్రేషన్ రెన్యూవల్‌పై విధిస్తున్న అపరాధ రుసుమును మినహాయించేలా చూడాలని వారు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. ఆయా అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని సబితారెడ్డి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీకేఎస్ ప్రతినిధులు చల్లా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.రామేశ్వరీదేవి, ఎం.వెంకటరమణారెడ్డి, తాండ యాదయ్యగౌడ్, హరికృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాఘవరెడ్డి, విజయేందర్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మీర్‌పేట్ కౌన్సిల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీకేఎస్ ప్రతినిధులు

డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను పరిష్కరించండి

- మేయర్ పారిజాతారెడ్డికి కార్పొరేటర్ అర్జున్ వినతి

సరూర్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ 28వ డివిజన్‌లోని శ్రీమారుతీనగర్‌కాలనీలో డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ సూర్ణగంటి అర్జున్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డిని కోరారు. కాలనీలోని మరో మూడు రోడ్లలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అనంతరం దిగువన గల 23వ డివిజన్ మీదుగా అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 28వ డివిజన్ శ్రీమారుతీనగర్‌లో రూ.10లక్షలు అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులకు ఆదివారం డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి మేయర్ పారిజాతారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను కార్పొరేటర్ అర్జున్ ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ అంచెలంచెలుగా కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించి త్వరలోనే అంచనాలు తయారు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్, నయనాచారి, నరేశ్, వెంకటేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.



కాలనీ సమస్యలను మేయర్ పారిజాతారెడ్డికి వివరిస్తున్న కార్పొరేటర్ అర్జున్

'ప్రతి హిందువు గోరక్షణకు నడుం కట్టాలి'

సైదాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి హిందువు గోరక్షణకు నడుం కట్టాలని గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి పిలుపునిచ్చారు. గోహత్యలు ఆపాలని, గోఆధారిత వ్యవసాయం ప్రోత్సహించాలని కోరుతూ సైదాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27న కాశ్మీర్ నుంచి ప్రారంభమైన గోరక్ష పాదయాత్ర ఆదివారం సైదాబాద్‌కు చేరుకుంది. సైదాబాద్ వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ గోరక్షణ దేశ రక్షణ కంటే ఏ మాత్రం తక్కువ కాదని మహాత్మాగాంధీ ప్రకటించారని, అంతటి ప్రాముఖ్యత కలిగిన గోమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యతయని అన్నారు. ఊరేగింపులో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిగౌడ్, బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. సెప్టెంబర్ 27న కాశ్మీర్ నుంచి ప్రారంభమైన గోరక్ష పాదయాత్ర 14 రాష్ట్రాల మీదుగా 4,900 కిలోమీటర్లు, 180 రోజుల పాటు కొనసాగి 2025 మార్చి 27న కన్యకుమారి చేరనుంది.



సైదాబాద్‌లో పాదయాత్రలో బాలకృష్ణ గురుస్వామి, సుభాష్‌చందర్జీ

అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రంపై పోలీసుల దాడి

- వ్యక్తి అరెస్ట్
- 19 సిలిండర్లు స్వాధీనం

సైదాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ అక్రమ ఫిల్లింగ్ నిర్వహణ కేంద్రంపై పౌరసరఫరాల శాఖ సిబ్బందితో సైదాబాద్ పోలీసులు దాడి చేశారు. ఫిల్లింగ్ నిర్వహకుడిపై కేసు నమోదు చేసి 19 సిలిండర్లు, రెండు కిట్లు స్వాధీనం చేసుకున్నారు. సింగరేణికాలనీ గుడిసెలలో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్నారన్న మలక్‌పేట పౌరసరఫరాల శాఖ కార్యాలయం సీనియర్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఆటో డ్రైవర్ సబావత్ చక్రీనాయక్(36)పై కేసు నమోదు చేసి 10 సిలిండర్లు, రెండు రీఫిల్లింగ్ కిట్లు స్వాధీనం చేసుకున్నారు.

వర్గీకరణలో బుడగ జంగాలకు 5శాతం వాటా దక్కాలి

హయత్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి హయత్‌నగర్ డివిజన్ కార్యవర్గ సమావేశం ఆదివారం హయత్‌నగర్‌లోని కుంట్లూర్ రోడ్డులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు కొడిగంటి నర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణ జరగాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం ఏ ఒక్కరికి చెందినది కాదని అన్నారు. వర్గీకరణలో అన్ని కులాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఉప కులాల్లో అధిక జనాభ కలిగిన బుడగ జంగాలకు వర్గీకరణలో 5 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా తూర్పాటి పెద్ద కోటయ్య, గౌరవ అధ్యక్షుడిగా కోడిగంటి రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా మొతే వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింహ, ఉపాధ్యక్షులుగా విష్ణు, వెంకటయ్య, అధికార ప్రతినిధిగా రెవల్లి సత్యం, కార్యదర్శిగా కుర్మయ్య, సహాయ కార్యదర్శిగా కృష్ణ, ప్రచార కార్యదర్శిగా బద్రీ, కోశాధికారి శ్రీను ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి బుడగ జంగాలు తదితరులు పాల్గొన్నారు.



బుడగ జంగాల సమావేశంలో ఐక్యత చాటుతున్న నాయకులు

సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

హయత్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆదివారం హయత్‌నగర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవీంద్రాచారి మాట్లాడుతూ దేశంలో సమసమాజ స్థాపన కోసం సీపీఐ కృషిచేస్తుందన్నారు. గడిచిన 100 సంవత్సరాలు పేద, బడుగు బలహీన వర్గాలు శ్రామిక వర్గాల హక్కుల కోసం సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, హయత్‌నగర్ మండల సహాయ కార్యదర్శి శోభన్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి సక్కునాయక్, నాయకులు వంశీవర్ధన్‌రెడ్డి, నాగరాజు, వెంకట్, పారిజాత, అనిత, సౌజన్య, జ్యోతి, సుమతి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికురాలికి చీరను అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, వైష్ణవీప్రసాద్

బాలాజీనగర్‌కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్‌కాలనీ సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. వైష్ణవీ క్యాటరర్స్ అధినేత వైష్ణవీ ప్రసాద్(పెండ్యాల శేషసాయి వరప్రసాద్) సొంత నిధులతో నిర్మించిన కాలనీ ముఖద్వారాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైష్ణవీప్రసాద్ తన తల్లిదండ్రులు సూర్యకాంతం, రామకృష్ణశర్మల జ్ఞాపకార్థం కాలనీ రజతోత్సవ వేళ ముఖ ద్వారం నిర్మాణానికి సొంత నిధులు సమకూర్చారు. కాలనీలో నిత్యం పారిశుధ్య పనులు చేపడుతూ సహకరిస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ ఆయన చీరలు పంపిణీ చేశారు. అంతేగాక కాలనీ పెద్దలందరినీ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహాసభకు భారీగా తరలిన బంజారాలు

సైదాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ బంజారా సంఘం పదో వార్షికోత్సవ మహాసభకు సింగరేణికాలనీ నుంచి భారీ సంఖ్యలో బంజారాలు ర్యాలీగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి తరలివెళ్లారు. ముఖ్యంగా మహిళలు బంజారా సంప్రదాయ దుస్తులతో ఆటపాటలతో ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్‌నాయక్, సక్రీబాయి, దేవులనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రద్ధానంద్ జీ బలిదాన్ దివస్

సైదాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ఆర్యసమాజ్‌లో స్వామి శ్రద్ధానంద్ జీ బలిదాన్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఢిల్లీ ఆర్య ప్రతినిధి సభ మంత్రివర్యులు వినయ్ ఆర్య హాజరై ప్రసంగించారు. శ్రద్ధానంద్ జీ 1902లో గురుకుల్ కాంగ్రీని స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న చామకూర రాజు తదితరులు

మన్సూరాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపర్చేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల ను నిరసిస్తూ సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ తక్షణమే మంత్రిత్వ శాఖనుంచి అమిత్‌షాను తొలగించకపోతే దేశవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు అంతా కలిసి ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి కె.వి.గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి వేముల కొండల్‌గౌడ్, బాలస్వామి, శ్యాంసుందర్‌గౌడ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీవీ రావు, వెంకటస్వామిలకు నివాళి

మన్సూరాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు, కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామిల వర్ధంతిని ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గ అంబేడ్కర్ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు ఎల్బీనగర్ చౌరస్తాలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కొంగరి నర్సింహారావు, మాలల సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్శపు శ్రీధర్, భిక్షపతి, నరేష్, నర్సింహ, శంకర్, కాశీనాథ్ పాల్గొన్నారు.

నేటి యువతులు నాటి వీరవనితల స్ఫూర్తితో ముందుకు సాగాలి

- వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షురాలు డాక్టర్ భేరి సునీతా రామ్మోహన్‌రెడ్డి

ఎల్‌బీనగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నేటి తరం యువతులు చదువు, ఉద్యోగాలతో పాటు నాటి వీరవనితల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షురాలు డాక్టర్ భేరి సునీతారామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తపేట వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయం సమీపంలో విశ్వహిందూ పరిషత్ యువతి విభాగం దుర్గావాహిని ఆధ్వర్యంలో మాతృవందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతారామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ యువతులు సున్నితత్వంతో పాటు శూరత్వం కలిగి ఉండాలన్నారు. నేటి యువతులు ఆధునికత పేరుతో అస్తవ్యస్తమైన జీవన విధానాన్ని అవలంభించడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం, ధర్మం, సమాజం పట్ల బాధ్యత కలిగి జీవించాలని సూచించారు. దుర్గావాహిని రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి మాట్లాడుతూ మాతృవందన కార్యక్రమం పేరిట నాటి వీరవనితల స్ఫూర్తిని స్మరించుకుంటున్నామన్నారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ యువతులు ఆరోగ్య విషయాలపై దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు అష్టలక్ష్మీ ఆలయం నుంచి కొత్తపేట, చైతన్యపురి, విక్టోరియా మెట్రోస్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారి వెంబడి దుర్గావాహిని యువతులు మాతృవందన యాత్ర నిర్వహించారు. దాదాపు వంద మంది చిన్నారులు భరతమాతతో పాటు నాటి వీరమాతల వేషధారణతో ఆకట్టుకున్నారు. సభ ప్రాంగణంలో యువతులు శక్తి ప్రదర్శన నిర్వహించారు. దుర్గావాహిని రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ శిల్ప, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నర్సింహమూర్తి, కార్యదర్శి లక్ష్మీనారాయణ, పూర్వ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి శశిధర్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, మాతృశక్తి రాష్ట్ర కన్వీనర్ పద్మశ్రీ, దుర్గావాహిని సంభాగ్ సంయోజక్ మాధవి, భాగ్యలక్ష్మి విభాగ్ మాతృశక్తి సంయోజిక చింతపట్ల జ్యోతి, సింధూజ, ఉమారాణి, శిరీష, నిఖిల, సంకల్ప, భవాని పాల్గొన్నారు.



మాతృవందన కార్యక్రమ ప్రారంభోత్సవంలో వీహెచ్‌పీ నేతలు శశిధర్, సురేందర్‌రెడ్డి, సునీతారామ్మోహన్‌రెడ్డి తదితరులు